
**తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ**



# నల్లపిల్ల

రాఖిశెట్టి చంద్రశేఖర్ ఆజాద్

దూరంగా చర్చి గంట పదకొండు సార్లు మోగింది.

కిటికీ పక్కనే నుంచొని బయటకు చూస్తున్నావు నీవు. వెన్నెట్లో ఎదురుగా కన్పిస్తున్న ఆ రోడ్డు తిన్నగా కొద్ది దూరం పోయి సడన్‌గా మలుపు తిరిగింది. మరికొద్ది సేపటి తర్వాత మలుపు తిరిగే నీ జీవితం చుట్టూ నీ ఆలోచనలు పరిభ్రమి స్తున్నాయి.......

.....మరో గంట తర్వాత 'రెడ్డి' వస్తాడు. ఈ యింటి గడపను దాటి అతని చెయ్యి పట్టుకొని గుడివైపు నడుస్తావు. నీ కాళ్ళు తడ బడవు. నీ గుండె దడ దడ లాడదు. నీ అరచేతిలో చెమట పట్టదు. మామూలుగా, చాలా మామూలుగా రోజూ కాలేజీకి వెళ్ళినట్లే అతని కూడా నడచి గుడి మెట్లెక్కి 'స్వామి' ముందు నిలబడతావు. కటకటాల తలుపుల వెనుక కళ్ళు తెరిచే నిద్రిస్తున్న నరసింహ స్వామి సాక్షిగా నీ మెడలో మూడు ముళ్ళు వేస్తాడు. ఆ తర్వాత అతని రెండు కాళ్ళకు నమస్కరిస్తావు. చివరిసారి స్వామికి రెండు చేతులు జోడించి వెనక్కి తిరుగుతావు. మంగళసూత్రం నీ గుండెలను బరువుగా అదుము తుంటే నెమ్మదిగా అతనితో పాటు మెట్లు దిగుతావు. స్టేషను కొచ్చి బండెక్కుతావు. బండి కదిలిముందుకు సాగినప్పుడు వెనక్కి కడసారిగా తిరిగి చూడవు. కళ్ళ నీళ్ళు తుడు చుకోవు - అసలు అవి వస్తేగా?

పట్టణంలో దిగిన తర్వాత నిన్ను తీసుకొని లాడ్జీకెళతాడు. నాలుగు రోజులు నీ శరీరంతో ఆనందంగా ఆడుకుంటాడు. ఆవేశం చల్లారుతుంది. ఈ శరీరం యిచ్చే సుఖం యింతేనా అని అన్పిస్తుంది. అదంటేనే - అసహ్యం పుడుతుంది. అతనిలో వివేకం మేల్కొంటుందివాళ్ళ నాన్నగారు గుర్తుకొస్తారు! వాళ్ళమ్మ పెరటి బావిలో దూకినట్లు కల వస్తుంది!! 'అన్నయ్యా'




అంటూ గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్న వాళ్ళ చిన్నారి చెల్లి కళ్ళలో మెదులుతుంది!!! అతనిలో 'స్ట్రగుల్' స్టార్ట్ అవుతుంది. ఆ బాధంతా అతని మొహంలో స్పష్టంగా చద వగలవు నీవు. అలా బాధ పడేకంటే నిన్నొదిలి పారిపోతేనే బావుంటుందనిపిస్తుంది. 'మీ యింటికి తిరిగి వెళ్ళిపోండి' అని అనబోయి ఆగిపోతావు. ముందుగా ఆమాట నీ నోటి నుంచి రావటం నీకిష్టం లేదు. మరుసటి రోజు ఉదయానికి అతనుండడు. టేబుల్‌పై 'పెద్ద లెటర్' - వూహూ - ' చిన్ని కాగితం' ఫేన్ గాలికి రెపరెప లాడుతుంటుంది. "నన్ను క్షమించు వీణా - నేను పిరికి వాడిని" అని వ్రాసి వుంటుంది. నీ గుండె ఆగిపోదు. కెవ్వున కేక

## కొత్త లగ్జరీ సబ్బు 'ఫ్రెస్కా'




న్యూ సింథాల్, క్రౌనింగ్ గ్లోరి, మార్వెల్ సబ్బుల విజయాన్ని పురస్కరించుకుని గోద్రెజ్ సంస్థ మరొక లగ్జరీ సబ్బు "ఫ్రెస్కా"ను ఆశ్చర్యం గొలిపే 3 రూపాయిల ధరకే మార్కెట్‌లో ప్రవేశపెట్టింది.

విస్తృతమైన సరసమైన ధరల సబ్బుల మార్కెట్టులో గణనీయమైన భాగాన్ని పొందేటందుకు గోద్రెజ్ సంస్థ చేస్తున్న తొలి ప్రయత్నంగా ఈ కొత్త 'ఫ్రెస్కా' సబ్బును ప్రవేశపెట్టడాన్ని పేర్కొనవచ్చు.

ఏ భారతీయ సబ్బులోను లేని అత్యంత ఖరీదయిన పరిమళ ద్రవ్యం 'ఫ్రెస్కా'లో వుంది. ఇదిగాక, ఎక్కువకాలం రావడానికి, తద్వారా విని యోగదారు చెల్లించిన వెలకు తగు ప్రతిఫలం దక్కడానికి వీలుగా ఈ సబ్బు ప్రత్యేక శ్రద్ధతో రూపొందింపబడింది. తేమ నుంచి రక్షణకు ఫాయిల్‌లో చక్కగా ప్యాక్ చేయబడిన 'ఫ్రెస్కా' సబ్బు కుటుంబం యావత్తు తక్కువ ధరకు ఎక్కువ సుఖం పొందడానికి ఎంతో అనువైనది. ఇది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అంతటా లభిస్తోంది.


పేసే కింద పడవు. మరో పది నిముషాలకు నీ 'శవం' ఫేన్‌కు వ్రేలాడుతూ వుండదు.... ఆ తర్వాత ఏం జరుగనున్నదో కూడా వూహించావు నీవు....

...అండర్ గ్రాడ్యుయేట్‌వి, నీకు ఏదో వుద్యోగం వస్తుందన్న ఆశ లేదు. కనీసం ప్రయత్నించవు కూడా. పోనీ ఏ యింట్లోనన్నా అంట్లుతోమి ఈ శేష జీవితాన్ని లాక్కు రావచ్చు ననుకున్నా - వయసులో వున్న ఆడపిల్లకు, అందునా 'లేచొచ్చిన' దానికి -అరవై యేళ్ళ ముసలి మొగుడున్న యిల్లాలు కూడా తన యింట్లో పని చూపించదు. మరింక చేసేదేముంది? రూంబాయ్స్ చేతుల్లో నలిగి, 'మేనేజర్ కక్కుర్తి కూడా తీర్చి, అలా అంచె లంచెలుగా ఏ 'సాని' వాడకో చేరతావు. అప్పటి నుంచి లైఫ్ రొటీన్ అవుతుంది. అప్పుడప్పుడు రైడింగ్‌లో పోలీసుల చేతికి చిక్కుతావు. వాళ్ళు తమ అవసరాన్ని పూర్తి చేసుకొని కోర్టుకైనా అప్పచెప్తారు లేకుంటే 'శిరోముండనం' అయినా చేయిస్తారు. అంతకు మించి యింకేమీ కాదుగా ఈ దేశంలో? 'గాంధీ' పుట్టిన దేశంలో??

అలా ఎందుకని 'చెడు'ను ముందుగానే వూహించటం? ఒక వేళ 'రెడ్డి' మంచి వాడే అయితే? పట్టణంలో చిన్ని యిల్లు తీసుకొని నీతో కాపురం పెడితే? -- అంత అదృష్టమా? అలానే జరిగితే కృతజ్ఞతతో జీవితాంతం అతనికి అణిగి మణిగి వుండవా? నీ నుంచి ఏ చికాకూ కలుగకుండా ఎక్కడి కక్కడ 'అడ్జెస్ట్' అయి సంసారాన్ని సాఫీగా నడుపుకు రావా? అదే నిజమైతే ఏ నాటికైనా యీ వూరు వొచ్చి ఆ 'స్వామి' కి 'నిలువు దోపిడి' యివ్వ కుంటావా? నీకు పుట్టే బిడ్డకు 'స్వామి' పేరు పెట్టు కోవా??

అప్పుడెప్పుడో మీ కాలేజీ ఫంక్షన్‌కు వచ్చిన కవి ప్రసాద్ ఈ వ్యవస్థలో 'బతుకు'ను 'కాలం కడలిలో కెరటం దెబ్బలకు వూగిసలాడే పడవగా' పోల్చటం గుర్తొచ్చింది నీకు. "చుక్కాని నీ దిశను మార్చదు, ఏ చుక్కానీ దారి చూపదు, చుట్టూ చీకటి తీరం, సూర్యోదయమే సందేహం!"

"మీ నాన్న నీకు పెళ్ళి చేయలేడనేనా నీవీ నిర్ణయానికి వచ్చింది?" - ఈ ప్రశ్నను యిప్పటికి వందసార్లు పైగానే వేసుకున్నావు నీకు నీవే.

కాదని నీకు తెలుసు. నిన్ను గుండెల మీద కుంపటిలా మీనాన్న ఎన్నడూ భావించలేదని, యిక ముందు భావించడనీ తెలుసు. ఇప్పటికి పది సంబంధాలు తెచ్చాడు నీకు - పదేమిటి వందైనా తెస్తాడు. ఏ సంబంధం వస్తే మటుకు ఏం లాభం? ఏ ఒక్క పెళ్ళికొడుకు నిన్ను నచ్చడని నీకు తెలుసు, మీ నాన్నకూ తెలుసు. అందుకు నీ 'నలుపు' ఒక్కటే కారణం కాదని కూడా తెలుసు. "పదిహేను వేలు దాకా యిచ్చు కుంటానండి, అదీ యీ యింటిని అమ్మి" అని మీ నాన్న అంటే " మీ పదిహేను వేలకు మీ అమ్మాయిని మేము చేసుకుంటాము కాని ఆ పదిహేను వేలకు మరి మా అమ్మాయిని చేసు కునే దెవరో చూపండి" అనలేదూ? అది కూడా నిజమేగా? "పోనీ పిల్ల బాగుంది కట్నం దేముంది పదివేలు అటో, యిటో అనుకుందా మంటే - పిల్ల కనీసం ఎరుపైనా కాక పోయే" అని స్పష్టంగా అనుకుంటుంటే నీకు వినపడ లేదూ? వాళ్ళు అనుకున్నారని 'ఫీల్' కావటం దేనికి - ఆ 'నిజం' నీకు తెలియనిదా?

లోయర్ మిడిల్ క్లాస్ ఫామిలీలో ఆడపిల్లగా పుట్టటం మొదటి తప్పని నీకు తెలుసు.అందునా 'నల్లదాని' గా పుట్టటం రెండవ తప్పనీ తెలుసు. ఈ రెండూ తెలిసి చేసిన తప్పులు కావు. అందుకే తెలిసి మూడవ తప్పు చెయ్యటం నీకిష్టం లేదు. నీవు పుట్టిన క్షణాన 'లక్ష్మీదేవి' పుట్టిందన్న సంతోషాన్ని మీ అమ్మా నాన్నల గుండెల్లో పెంచి, ఈ రోజు నీ పెళ్ళి పేరున వున్న ఈ కాస్తంత నీడను అమ్మించి వాళ్ళను వీధుల్లోకి తరమటం నీకు యిష్టం లేదు. అందుకే - కేవలం అందుకే నీ యీ నిష్క్రమణ!!!

ఆ పదిహేను వేలకు అంతకు సరిపోను వాడు ఏనాడో ఒకడు నీకు 'మొగుడు'గా రాక పోడని నీకు తెలుసు. అతనితో కాపురం చేసి ముగ్గురి పిల్లలను కని ఈ దేశంలోకి విడవక పోవనీ నీకు తెలుసు. నీకు పుట్టిన 'ఆడపిల్ల' కు పెళ్ళి చెయ్యటాన్కి అమ్మవలసిన వేమిటో ముందుగానే చూసుకోవాలనీ తెలుసు. అయినా - అప్పుడు - యిల్లును అమ్మించి యిల్లా లును తెచ్చుకున్న 'ఆయనగారు', ఆ తర్వాత అది కావాలనీ, యిది కావాలనీ అడగడని నమ్మక మేమిటి? అత్త, ఆడబిడ్డా సాధించరనేమిటి? కిరసనాయిలు పోసి తగలెయ్యరనేముంది?

ముందుగానే అలా వూహిస్తున్నందుకు నవ్వు వచ్చింది నీకు. అందరు ఆడపిల్లల్లా కాకుండా యింత విడ్డూరంగా వూహిస్తున్నందుకు ఆశ్చర్యమేసింది నీకు. ఇదో రకం 'జబ్బేమో' అనుకున్నావు నీవు. అలా అనుకుని తృప్తి పడదామనుకున్నావు. కానీ, నీకు తెలుసు నీ ఆలోచనల్లో అసంభవం ఏమీ లేదన్న నిజం!

పోనీ - చక్కగా చదువుకొని, ఉద్యోగం చేసుకుంటూ అమ్మా నాన్నలను సుఖపెడుతూ తమ్ముడ్ని పెద్ద చదువులు చదివిస్తేనో? -- అసలు పెళ్ళి చేసుకోకుండానా? --- నచ్చిన వాడు, మనసైన వాడు ఎదురైన పెళ్ళి చేసుకోవచ్చుగా అంతగానయితే? --- నీకు నచ్చటం కాదుగా, నిన్ను నచ్చిన వాడు, నిన్ను మెచ్చిన వాడు రావాలిగా? --- ఎవరన్నా వచ్చినా నీ 'వుద్యోగాన్ని' చూసి వస్తారేగాని, నీ 'నలుపు'ను చూసి మనసై రారుగా? ---- 'నలుపూ' ఒక రంగే నని, 'ఎరుపు' కు ప్రత్యేకత ఏమీ లేదని --- అదనపు 'సుఖాన్ని' అది ఏమీ యివ్వదని అనుకోలేరుగా???

చర్చి గంట పన్నెండు సార్లు మ్రోగింది.

మరో పది నిముషాల్లో రెడ్డి వస్తాడు. నీవు అతనితో 'లేచి' పోతావు. అమ్మా, నాన్న, తమ్ముడు కుమిలి కుమిలి ఏడుస్తారు. పది రోజుల తర్వాత సర్దుకుంటారు. పోనీలే - పిల్ల ఎక్కడున్నా సుఖపడితే అదే పదివేలు అని అనుకుంటారు. ...అంతే! మనిషి చనిపోతేనే పది రోజుల తర్వాత మర్చిపోతున్నారు - లేచిపోతే సర్దుకు పోలేరా? కనీసం యిల్లు మిగిలించిన తృప్తి నీ కుంటుంది. అది చాలదూ?

కాకుంటే వూరు గుప్పు మంటుంది. "పిల్ల చాలా అమాయకంగా వుండేది గదా, ఎలా లేచి పోయిందబ్బా?" -- అంటారు. "అమాయకమా --పాడా? నాలి రకాలు అలానే వుంటాయి" -- అనుకుంటారు. "వాళ్ళ అమ్మా నాన్న కాబట్టి యింకా బ్రతికి వున్నారు, అదే మేమైతే తల పగుల గొట్టుకొని చచ్చే వాళ్ళం" --అంటారు. "ఆ - ఎన్ని రోజుల ముచ్చటలే? మూడవ నాటికి ఆ 'ముండ'ను వదిలి రాడా?" --ఆశీర్వ దిస్తారు. "ఆ రెడ్డి వాళ్ళ నాన్న మనుషులను పంపాడంట. దాన్ని చంపి ఏ కృష్ణలోనో తోసి వాడిని లాక్కొస్తారు చూడండి"-తృప్తిపడతారు. "అయినా -- ఆ నల్ల దానిలో ఏం చూసి లేపక పోయాడబ్బా?" --సందేహం మరి కొందరిలో! అవునా -- అసలు నీలో ఏం చూసి నిన్ను రెడ్డి తనతో తీసుకెళుతున్నట్లు? .... ఈ ప్రశ్న నీలో ఎప్పటి నుంచో వుంది. .... అదొక్క పాయింట్ మీదనే నీ గుండెల్లో చిన్ని ఆశ.... ఆ 'ఆశ' మరి అటో? లేక యిటో?

దూరం నుంచి 'రెడ్డి' రావటం చూసావు. నెమ్మదిగా బయటకు నడిచావు.

మరి కొన్ని క్షణాల తర్వాత మీ నాన్న లేచి, గుమ్మం దాకా వచ్చి, మీ వెనుక మిమ్మల్ని ఆశీర్వదించిన సంగతి వెనక్కి తిరిగి చూడని నీకు తెలియదు. ●

## జంపన పెద్దిరాజు స్మారక కథలపోటీ

కీర్తిశేషులు జంపన పెద్దిరాజు జ్ఞాపకార్థం జంపన శ్రీగిరిరాజు నిర్వహిస్తున్న కథల పోటీ నిమిత్తం సాంఘిక ప్రయోజనం, సామాజిక చైతన్యం కలిగిన కథలను రచయితల నుంచి ఆహ్వానిస్తున్నారు.

**బహుమతులు**

మొదటి బహుమతి రు. 1000

రెండవ బహుమతి రు. 500

* మొత్తం రు. 1500 నగదు బహుమతులు నిర్ణయించిన ఈ పోటీకి పంపే రచనల నిడివి 9, 10 ఫుల్‌స్కేప్ పేజీలకు మించరాదు.
* రచయితలు, రచయిత్రులు కథలతోపాటు తమ పూర్తి చిరునామాను, రచన దేనికీ అనుకరణ, అనుసరణ, అనువాదం కాదని, అముద్రితమన్న హామీని జత చెయ్యాలి.
* రచనలు తిప్పి పంపడం సాధ్యపడదు.
* బహుమతి పొందిన కథలు రెండింటిని ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1987 సంక్రాంతి సంచికలో ప్రచురిస్తాము.
* బహుమతి పొందిన కథలు కాక, సాధారణ ప్రచురణకు యోగ్యమైన రచనలను ఎంపిక చేసి, వీలువెంట ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రకటిస్తాము.
* శ్రీయుతులు స్మైల్, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ వెల్చేరు నారాయణరావుల సానుభూతి సహకారాలతో నిర్వహిస్తున్న ఈ కథల పోటీకి తుది తీర్పు సంపాదకునిదే. దీనిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం సాధ్యపడదని మనవి.

**గడువు తేదీ**

మీ రచనలు మా కార్యాలయానికి చేరవలసిన ఆఖరు తేదీ

31 డిసెంబర్, 1986

- ఎడిటర్

చిరునామా:
జంపన పెద్దిరాజు స్మారక కథల పోటీ,
కేరాఫ్ ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్ట్‌బాక్స్ నెం: 712,
లబ్బీపేట, విజయవాడ- 520 010.